# ప్రత్యక్ష దైవం



- భారతీకృష్ణ

సర్వం బ్రహ్మమయం. అందమైన ప్రకృతినీ, చరాచర జీవరాశులన్నిటినీ సృష్టించిన తరువాత, ఒక్కొక్క దానికి ఒక్కొక్క స్థానం కల్పించి ఇవన్నీ అనుభవించి ఆనందించడానికి ఎవరున్నారూ.. అని ఆలోచించాడు ఆ బ్రహ్మయ్య. వెంటనే ఆయన మేధస్సులో అందమైన ఒక సృష్టి కానరాసాగింది. ఆ సృష్టి జగత్ సృష్టికే ఆధారమైన అద్భుత సృష్టి అని తెలిసి దానివల్ల ప్రపంచానికి ఎంతో అర్థం, పరమార్థం గోచరించి దానికి ఒక రూపకల్పన చేసుకున్నాడు. ఒక పథకం ప్రకారం అన్ని అవయవాలు అమర్చిన కొన్ని బొమ్మల్ని ఆయన తయారు చేయటం మొదలుపెట్టాడు.

అలా తయారవుతున్న ఆ బొమ్మలు ఎంతో అందంగా, మరెంతో ఆకర్షణీయంగా కనిపించాయి. ఎటు త్రిప్పితే అటు, అతి సులువుగా ఆడసాగాయి. తను సృష్టించిన ఈ మాయా జగతికి వాటి వల్ల ఎంతో ప్రయోజనం కల్గుతుందని అనిపించి వాటన్నిటికీ రకరకాల రంగుల మెరుగులు దిద్దాడు. రంగులద్దుకొన్న వాటిని చూస్తుంటే ముచ్చట కలిగిందాయనకు. అయితే, అన్ని బొమ్మలూ తనను కున్న ఫలితాలిస్తాయా? అనే సందేహం కూడా కలిగింది. ఇవ్వవనీ తెలిసిపోయింది. బొమ్మలుగానే మిగిలిపోతాయేమోనని, వాటికి చైతన్యం అనే ఊపిరి పోసాడు. వెంటనే ఆ బొమ్మల్లో సొంత కదలికలు వచ్చి అందంగా ఆడటం మొదలుపెట్టాయి. ఆ ఆట చూసి తెగ సంబరం కలిగిందాయనకు. మురిసిపోయాడు. తన ఇచ్ఛానుసారం ఆడించసాగాడు. ఆడుతున్నాయవి.. అయినా తృప్తి కలుగలేదాయనకు. ఏదో వెలితి తోచింది. మళ్ళీ త్రిప్పాడు. మళ్ళీ.. మళ్ళీ.. ఇలా తిరుగుతూ.. తిరుగుతూన్నంతలోనే ఒక చిత్రం జరిగింది. ఆడి, ఆడి ఆ బొమ్మలన్నీ ఒకే బొమ్మగా నిలిచాయి. ఆ ఒక్క ప్రధానమైన బొమ్మలోనుండి అనేకమైన బొమ్మలు పుట్టుకొచ్చి, అవన్నీ కూడా ఆ ఒక్క బొమ్మ చుట్టూ గిరగిరా తిరుగసాగాయి. తిరుగుతూ ఆ బొమ్మను ప్రత్యేకించి ప్రశంసించసాగాయి. అప్పుడాయనకు ఆనందం, బ్రహ్మానందం కలిగింది.

తనుకున్నదీ, తపించింది కూడా అదే. తన ప్రయత్నం ఫలించిందనిపించి తృప్తి కలిగింది. పరవశించాడు. తన్మయంగా చూడసాగాడు.

తనచుట్టూ తిరుగుతున్న అన్ని బొమ్మలూ తనను పొగడ్తం చూసేసరికి, ఆ బొమ్మకు గర్వం కలిగి మహోతిశయంతో క్రొత్త పరిసరాలన్నీ తిలకించింది. అందమైన ప్రపంచ ప్రకృతి కళ్ళకు విందు కలిగిస్తోంది. నా కళ్ళకు కనిపించేదేనా! ఇంకా ఎంత విశాలమైన ప్రకృతి ఈ జగతిలో నిండివుందో చూసి రావాలి. తక్షణం ఎగిరిపోవాలి. ఎక్కడికో రెక్కలొచ్చి ఎగిరిపోవాలి. ఈ విశ్వాన్నంతా చుట్టి రావాలనే భ్రమ కలిగింది. కాని! అందుకు తగ్గ ఆధారాలన్ని పూర్తిగా ఈ మహానుభావుడు నాకు కల్పించలేదే.. అని బాధపడింది. నిరాశపడి ఆయనను నిలదీసింది. ఆశ్చర్యపడ్డాడాయన. ''అలా అడగటానికి నువ్వెవరు? నువ్వడిగితేనే నేను నిన్ను తయారు చేసానా! నువ్వు నా బొమ్మవు, నా ఇష్టం. నీకు ఏది, ఎప్పుడు, అవసరమనిపిస్తే అప్పుడు అది చేసి నిన్ను అందంగా మలచుకొంటూ వుంటాను.'' అని ఆ బ్రహ్మయ్య సెలవిచ్చేసరికి ఆ బొమ్మ మూతి లక్కపిడతలా ముడుచుకొంది. అది చూసి జాలిపడిన ఆయన పకపకా నవ్వి ఇలా అన్నాడు.

''చూడు! ఒక్కటి మాత్రం మర్చిపోకు. నాచేతిలో తయారయినదేదీ వ్యర్థం కాదు. కేవలం మట్టితో తయారు చేసిన దానవు కావు నీవు. నీ జన్మకు గల సార్ధకత గుర్తెరిగి, పూర్వ జన్మ సుకృత ఫలాల సువాసనలన్నీ రంగరించి నీకు మెరుగులు దిద్దుతున్నాను. నీ తనువు పై భాగాన, లోపలి భాగాన వున్న పగుళ్ళను అంటే దేహ, మానసిక వైకల్యాలను సరిజేసి అందంగా తీర్చిదిద్ది నిన్నొక ఉన్నతమైన స్థానంలో నిలబెడతాను.

అసలు ఈ సృష్టికి మూలం, (కారణ భూతురాలివీ) నీవే. నిన్ను ఆధారంగా చేసుకొనే నేనీ సృష్టి సంకల్పించాను. నిన్ను అగ్రస్థానంలో నిలబెడతాను. అప్పుడు అందరి దృష్టి నీ మీదే వుంటుంది. నిన్ను ఈ లోకమంతా గౌరవించి, పూజిస్తుంది. అలా నువు పూజలందుకొన్న రోజు నీ జన్మకు సార్ధకత, నా కృషికి ఫలితం లభిస్తాయి'' అని, ఆస్థానం యొక్క విశిష్టతను ఆ బొమ్మకు తెలియజేసాడు.

ఆయన చెప్పిన ఆ స్థానం పొందటానికి ఆ బొమ్మ నిరంతరం ఆయన్నే పూజిస్తూ, ఆయన్నే ధ్యానిస్తూ, ఆ అర్హత పొందటానికి పట్టుదలతో తపస్సు చేస్తుంది. అది చూసి మిగిలిన బొమ్మలన్నీ కూడా తపస్సు మొదలుపెట్టాయి. అయితే అన్నింటికి ఆ స్థానం పొందే అర్హత వుందో.. లేదో..

కానీ! ఆ బొమ్మ యొక్క తపస్సు ఫలించింది. ఆయన నిర్దేశించిన అర్హత సంపాదించుకొని ఆయన దృష్టికి వచ్చిన ఆ ఒక్క బొమ్మ, మాత్రం భగవంతునితో పాటు సరిసమానంగా పోటీ పడుతూ పూజలందుకుంటూ పూజామందిరంలో దివ్యమైన స్థానాన్ని సంపాదించగలిగింది.

ఆ బొమ్మకు రెండే రెండక్షరాలు గల చక్కటి నామధేయం కూడా ఆయనే నిర్ణయించారు. సులువుగా పిలుచుకోడానికి, మన పెదవుల మధ్య అతి తేలికగా ఒదిగిపోయే పవిత్రమైన నామం అది. ఆ రెండక్షరాలలో మొదటి అక్షరం మమతకు, రెండవది మమకారానికి ప్రతీకలుగా నిలిచాయి. చక్కటి రూపం ఆ బొమ్మ సొంతం. దానితోపాటు ద్రవించేటటువంటి మనసు ఆ రూపానికి నిండుతనం తెచ్చిపెడుతుంది. అలాగే ఒక హస్తం 'దయ'ను మరొక హస్తం దాక్షిణ్యాన్ని కలిగి వుంటే, ఆ బొమ్మకు గల నేత్రాల్లో ఒకటి కరుణను మరొకటి కనికరాన్ని కురిపిస్తుంటాయి. ఎప్పుడూ తేజోవంతంగా వుండే దివ్య జ్యోతుల్లాంటి ఆ నేత్రాలే ఎల్లపుడూ ఈ జగతికి వెలుగును చూపిస్తుంటాయి. పాలు తేనె రంగరిస్తే ఎంత మధురంగా వుంటుందో ఆ బొమ్మ యొక్క ప్రతి పలుకులోనూ అంత మధురమైన అనురాగం తొణికిసలాడ్తుంటుంది. ఆ బొమ్మకు గుణాలంటూ చాలా లేవు. ఒకే ఒక గుణం ఉంది అదే క్షమాగుణం. ఇన్ని సలక్షణాలతో మూర్తీభవించిన అందమైన ఆమూర్తి యొక్క తత్త్వం నిజంగా అమృత తత్త్వమే.

ఇంతటి అద్భుతమైన సృష్టినంతటనూ కేవలం రెండక్షరాలలో నిక్షిప్తం చేసుకున్న ఆ దయామయి ఎవరో కాదు 'అమ్మ'! మనకు జన్మనిచ్చిన మన కన్నతల్లి.

ఎంతో పవిత్రమైన స్థానాన్ని పొందటానికి ఎంతో ఎంతో తపస్సు చేసి మనకు జన్మనిచ్చిన మన కన్నతల్లి. అందుకే అంటారు 'తల్లికి మించిన దైవము లేదని'. ఈ సృష్టికి ఆధారభూతంగా నిలిచిన మన 'అమ్మను', అనురాగమూర్తియైన మన తల్లిని, ఆ త్యాగమయిని మనసులో ప్రతిష్ఠించుకొని అంకిత భావంతో, ఆరాధనా భావంతో పూజించి ఆమె రుణం తీర్చుకునే ఈ మానవ జన్మ ఎంతో ధన్యం.

తనను సృష్టించిన ఆ బ్రహ్మయ్య ఆశయాన్ని అమ్మ ఎలా ఫలింపజేసిందో, అలాగే మనకు జన్మనిచ్చిన మన అమ్మను కూడా మనసారా పూజించి ఆమె రుణం తీర్చుకుని ఈ మానవ జన్మను ఫలింపజేసుకుందాం.

★